శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



శ్రమదానంలో గిరిజనులు



గాదెలపుట్టు నుంచి గున్నసెలమ వరకు నిర్మించిన రోడ్డు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బాబుసాల పంచాయతీ గున్నసెలయ గ్రామానికి రహదారి సదుపాయం లేదు. అత్యవసర వైద్యం, నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. మైళ్ల దూరం కొండదారిలో కాలినడకన ప్రయాణం చేయాల్సి వస్తోంది. పదేళ్ల క్రితం తాత్కాలికంగా నిర్మించిన మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. తుప్పలు పెరిగి రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. గ్రామానికి రోడ్డు నిర్మించుకోవాలని గ్రామస్థులంతా ఏకమయ్యారు. శ్రమదానంతో తుప్పలు తొలగించి, కంకర, మట్టి పోసి రోడ్డు నిర్మించుకున్నారు. తమ గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామస్థులు ముకుందు, స్వామి, గాసీ, గంగాధర్ తదితరులు కోరారు.

నేటి మీ కోసం రద్దు

పాడేరు, న్యూస్‌టుడే: ఈ నెల 11వ తేదీ శుక్రవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం దుర్గాష్టమి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఫిర్యాదులు అందజేయడానికి ఎవరూ రావొద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈనాడు అల్లూరి సీతారామరాజు

శుక్రవారం 11 అక్టోబరు 2024



ఎక్సైజ్ సిబ్బందికి ఎన్నో సవాళ్లు!

'మద్యాన్ని నియంత్రిస్తాం. కేవలం స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తాం..' అంటూ గత ప్రభుత్వం ఉత్తర కుమార ప్రగల్భాలు పలికింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను తీసుకొచ్చింది. అనంతరం వైకాపా నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చేష్టలుడిగి కూర్చుంది. నూతన మద్యం విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసింది. తద్వారా ఆ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేసింది. గాడితప్పిన గత పాలన నేపథ్యంలో సదరు శాఖపై ఇప్పుడు అత్యంత కీలక బాధ్యతలు ఉన్నాయి.

ఈనాడు, పాడేరు - న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం

గత ప్రభుత్వం సెబ్ పేరుతో ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పేరుతో కొత్త విభాగాలను పరిచయం చేసి 70శాతం సిబ్బందిని దీనికే కేటాయించింది. దీంతో పాత, కొత్త విభాగాల్లో అవసరమైన సిబ్బంది లేక అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం, చింతూరులో ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఈ ఐదు స్టేషన్ల పరిధిలోనున్న ఉద్యోగులందరినీ సెబ్‌కు కేటాయించారు. దీంతో ఆ శాఖలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సిబ్బందికి కాళ్లు, చేతులు కదపలేని పరిస్థితి ఎదురైంది.

వైకాపా సర్కారు పాటించిన పాత మద్యం విధానానికి పాతరేసి పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తరహా విధానాన్ని తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలలోనే నూతన మద్యం విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానుంది. ఎక్సైజ్ శాఖలోనే గతంలో మాదిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు కానుంది. సెబ్‌ను రద్దు చేసి అందులోని అధికారులు, సిబ్బందిని ఎక్సైజ్ శాఖకు కేటాయించారు. దీంతో ఆ శాఖ పునరుత్తేజితం కానుంది. ఈ నిర్ణయంపై ఆ శాఖలో హర్షం వ్యక్తమవుతోంది.



గ్రామగ్రామాన గొలుసు దుకాణాలు

గంజాయి, నాటుసారా జోరు

మద్యం డోర్ డెలివరీ

గత ప్రభుత్వ హయాంలో ఒక్కొక్క గ్రామంలో నాలుగైదు మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయి. వీటిలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. పలుచోట్ల మద్యం కావాల్సిన వారికి స్కూటీల ద్వారా డోర్‌డెలివరీ చేస్తున్నారు. ఒక్క చింతపల్లి సబ్‌డివిజన్ పరిధిలోనే సుమారు మూడు వందల గొలుసు దుకాణాలున్నాయి. పలు గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు తగినంత బలం, బలగం లేకపోవడంతో మౌనంగా ఉన్న ఎక్సైజ్ శాఖ.. తాజా పరిణామాల నేపథ్యంలో దూకుడు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గంజాయి మత్తు, రవాణా..

బలోపేతమైన ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎదుట సవాళ్లు చాలానే ఉన్నాయి. రాష్ట్రాన్ని గంజాయి మత్తు పట్టి పీడిస్తోంది. జిల్లాలో ఆ ప్రభావం తీవ్రంగా ఉంది. ఒడిశా రాష్ట్రం నుంచి అల్లూరి జిల్లా మీదుగా గంజాయి రవాణా ముమ్మరంగా సాగుతోంది. పలు చోట్ల యువత మత్తులో జోగుతూ తరచూ నేరాలకు పాల్పడుతున్న ఉదంతాలు కోకొల్లలు.. జిల్లాలో రోజూ ఎక్కడో ఒక చోట గంజాయి పట్టుబడుతూనే ఉంది.

కూటమి ప్రభుత్వం గంజాయి నిర్మూలనను తమ ప్రధాన అంశంగా ప్రకటించుకుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ గంజాయి నిర్మూలనపై దృష్టి సారించాల్సి ఉంది.



చింతపల్లిలో పట్టుబడిన గంజాయి (పాత చిత్రం)

అన్నీ అరికడతాం: సబ్‌డివిజన్ పరిధిలో నాటుసారా తయారీ, అక్రమ రవాణా గంజాయి సాగు, రవాణా, గొలుసు దుకాణాలను అరికడతాం. ఎవరైనా చట్టవ్యతిరేక పనులు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.



- కూర్మారావు, ఎక్సైజ్ సీఐ, చింతపల్లి

గత నెల 29న కొయ్యూరు మండలం చీడీపాలెం కూడలి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా రెండు కార్లలో మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 851 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గత నెల 19వ తేదీన గూడెంకొత్తవీధి వద్ద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై 69 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. యువకులను పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఆగస్టు 20వ తేదీన జి.మాడుగుల మండలం ఉరుము వద్ద స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు ఆటోలో గోనె సంచుల్లో 160 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు.

ఆగస్టు 10వ తేదీన చింతపల్లి మండలం అన్నవరం పోలీసులు లోతుగెడ్డ వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 102 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అయిదుగురు నిందితులను అరెస్టు చేశారు.

మారని పేరు.. ఇదేం తీరు..!



సీకరిలో నేటికి రైతు భరోసా కేంద్రంగానే మిగిలిన వైనం

రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి సర్కారు రైతు భరోసా కేంద్రాలను రైతు సేవాకేంద్రాలుగా మార్చింది. కూటమి పాలన వచ్చి వందరోజులు గడుస్తున్నా వ్యవసాయ శాఖ తీరుమారలేదు. పెదబయలు మండలం సీకరిలో ఇటీవల పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవా కేంద్రం ఆవరణలో జరిగింది. ఈ భవనానికి గత వైకాపా ప్రభుత్వ హయాంలోని రైతు భరోసాకేంద్రం పేరే ఇప్పటికీ ఉన్నా దానిని ఏ మాత్రం పట్టించుకోలేదు.

- పెదబయలు, న్యూస్‌టుడే

గిరిపుత్రులకు టాటా ట్రస్టు చేయూత

చింతపల్లి, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లా అంటేనే పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఇక్కడ ఎటువంటి పరిశ్రమలూ లేవు. ఇక్కడి గిరిజనుల జీవనోపాధి మెరుగుదలకు టాటా ట్రస్టు ముందుకొచ్చింది. టాటా ట్రస్టు విజయవాహిని అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. మన్యంలో వ్యవసాయాభివృద్ధితోపాటు గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగు, తలసరి ఆదాయం పెంపునకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రతన్ టాటా మృతి సందర్భంగా ట్రస్టు సేవలను గిరిజనులు గుర్తు చేసుకుంటున్నారు.

అల్లూరి జిల్లా మైదాన ప్రాంతాలకు భిన్నంగా ఉంటుంది. ఇక్కడ భౌగోళిక పరిస్థితులు, నీరు, నేల, వాతావరణం భిన్నమైన పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు గుర్తించారు. మన్యంలో వాణిజ్యపరమైన కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం, పిప్పలి, వంటి ఉద్యాన, సుగంధ ద్రవ్యపంటలతోపాటు వలిశెలు, పొద్దుతిరుగుడు, వేరుసెనగ, ఆవాలు, లిన్సీడ్ వంటి నూనెగింజలు, రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు, డ్రాగన్, లిచీ, ప్యాషన్‌ఫ్రూట్, స్ట్రాబెరీ, ఆవకాడోవంటి ఉద్యాన పంటలు పండుతున్నాయి. సగటున గిరిజన రైతుల ఆదాయం ఏడాదికి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ ఉంది. దీన్ని కనీసం రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెంచాలన్న దృఢ సంకల్పంతో టాటా ట్రస్టు గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి మెరుగుదల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయంలో అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతోపాటు రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు, జీవన ఎరువులు, టార్పాలిన్లు వంటివి ఉచితంగా సరఫరా చేస్తోంది. వీటితోపాటు రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తూ గిరిజనులకు చేదోడుగా నిలుస్తోంది. చింతపల్లి మండలంలో 43 గ్రామాల్లో టాటా ట్రస్టు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని విజయవాహిని ట్రస్టు వ్యవసాయ సాంకేతిక నిపుణుడు డాక్టర్ అప్పలరాజు తెలిపారు.



కొల్లాపుట్టు కూడలిలో టాటా సౌజన్యంతో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్



చింతపల్లిలో టాటాఎలక్ట్రానిక్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన గిరిజన యువతులు(పాత చిత్రం)

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతంతోపాటు ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరవేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జి.మాడుగుల తెదేపా కార్యాలయంలో గురువారం కూటమి పార్టీల మండల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈశ్వరి హాజరై మాట్లాడారు. కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని పీవీటీజీలకు 2900 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈనెల 14 నుంచి రహదారుల నిర్మాణ పనుల ప్రారంభోత్సవాలు పండగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. నవంబరు నుంచి ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందజేస్తారని, సూపర్ సిక్స్ పథకాలు త్వరలోనే అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తెదేపాలోనే ఉంటూ పార్టీకి నష్టం చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఎంపీపీ కళ్యాణి, నాయకులు రమణమూర్తి, విశ్వ, గోవిందు, వెంకటరమణ, నాగబ్బాయి, కొండలరావు, కళ్యాణం, భీమన్న, మత్స్యలింగం, వెంకటరమణ, కె.భీంబాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

దుర్గమ్మ సారె ఊరేగింపు



ధారకొండలో విజయదుర్గమ్మ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన తీపి వంటకాలను మహిళా భక్తులు, భవానీ మాలధారులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్థానిక మెయిన్‌రోడ్డు నుంచి మండపం వద్దకు ఊరేగింపు సాగింది. - న్యూస్‌టుడే, సీలేరు

డీజీపీవోగా లవరాజు



లవరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న డీఎల్‌పీఓ కుమార్, కార్యాలయ సిబ్బంది

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లా గ్రామ పంచాయతీ అధికారి (డీజీపీవో)గా బి.లవరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో డ్వామా విజిలెన్స్ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. పంచాయతీల అభివృద్ధికి అన్నిశాఖల అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని చెప్పారు. కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేస్తామన్నారు. ఆయన్ను డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, కార్యాలయ సిబ్బంది మర్యాపూర్వకంగా కలిశారు.



చింతపల్లి డీఎఫ్‌ఓగా నర్సింహరావు



చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి అటవీశాఖ డీఎఫ్‌ఓగా వై.వెంకట నర్సింహరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ డీఎఫ్‌ఓగా పనిచేసిన సూర్యనారాయణ ఏలూరు సామాజిక అటవీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నర్సింహరావు వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో, అటవీ టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు. ఆయనకు రేంజి అధికారులు అప్పారావు, ఎల్‌బీకే పాత్రుడు, శివరంజని, భార్గవవర్మ, వెంకటరావులు, డీఆర్‌ఓలు వెంకటరాజు, పడాల్, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


డీఎఫ్‌వో రవీంద్ర బాధ్యతల స్వీకరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్‌వో)గా రవీంద్ర దామ బాధ్యతలు చేపట్టారు. 2017 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన రవీంద్ర ఏలూరు నుంచి బదిలీపై వచ్చారు. అటవీ ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.



దరఖాస్తు గడువు పొడిగింపు

పాడేరు, న్యూస్‌టుడే: మిరియాలు వలిచే, శుభ్రపరిచే యంత్రాలను రాయితీపై పంపిణీ చేయడానికి దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుగంధద్రవ్యాల బోర్డు సహకారంతో గిరిజన రైతులకు అల్లం, పసుపు పాలిష్ చేసే యంత్రాలను కూడా అందజేస్తామన్నారు. రైతులు ముందుగా పూర్తిగా చెల్లించాలని, ఆ తర్వాత 75 శాతం రాయితీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 90 శాతం రాయితీపై వీటిని అందిస్తామన్నారు. ఐటీడీఏ కార్యాలయంలోని స్పైసెస్ బోర్డు కార్యాలయంలో ఉన్న ఉద్యాన విభాగంలో లేదా సెరికల్చర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.






చిట్టి తల్లులను కాపాడుకుందాం..

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే



ఇంటికి వెలుగును నింపే ఆడపిల్లలను కాపాడుకోవడం నేటి సమాజంలో కీలకంగా మారింది. మగపిల్లల సంఖ్యతో పోలిస్తే పుడుతున్న ఆడపిల్లల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పుట్టేది ఎవరో తెలుసుకోవడం సులువవుతోంది. ఆడపిల్ల పుడుతుందని నిర్ధారించుకుంటున్న కొంతమంది తల్లిదండ్రులు గర్భంలోనే, పుట్టాక చిదిమేస్తున్న ఉదంతాలు అందరినీ కలిచివేస్తున్నాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ చిట్టితల్లులను పుట్టనీకుండా చేస్తున్నారు. ఆడపిల్లలను కాపాడుకోడానికి ప్రభుత్వం ఎంత ప్రచారం చేస్తున్నా చాలామందిలో మార్పు రావడం లేదు. అనకాపల్లి జిల్లాలో ఏడాదిలో 1000 మంది మగపిల్లలు పుడుతుండగా 918మంది ఆడపిల్లలే జన్మిస్తున్నారు. ఈ సంఖ్యను పెంచడం, సరిసమానం చేయాలని అధికారులు యత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు.



ఇంట్లో ఆడపిల్ల పుట్టి పెరుగుతుంటే ఆ ఇంటికి ఉండే కళే వేరు. అయితే కొంత మంది వరకట్నాలు, ఇతర కారణాలతో అమ్మాయిలను భారంగా భావిస్తూ జన్మనివ్వడానికి ఆసక్తి చూపడం లేదు. బాలికలను మధ్యలో చదువు ఆపేయించి, త్వరగా పెళ్లిళ్లు చేయడం లాంటివి జరుగుతున్నాయి. బాల్య వివాహాలతో అమ్మాయిల ఆరోగ్యం దెబ్బతింటుంది. చిన్నవయసుల్లోనే పెళ్లి చేయడం, గర్భం దాల్చడం వల్ల బాలికల ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. బాల్యవివాహాలతో జరిగే నష్టాన్ని వివరించడంతో పాటు ఇలా వివాహాలు చేసేవారికి పడే శిక్షలను వివరిస్తూ అధికారులు ప్రచారం చేస్తున్నారు.


ముమ్మరంగా ప్రచారం: బాలికల జనాభా సంఖ్య తగ్గడం, లింగ వివక్ష పెరుగుతుండటంతో దీన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. బాలికల సంరక్షణ, జనాభా సంఖ్య పెంచేలా 'బేటీ బచావో.. బేటీ పఢావో' పేరిట ప్రచారం ముమ్మరం చేశారు. చదువు మానేస్తున్న బాలికలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, స్వయం ఉపాధి అందించే చర్యలు తీసుకుంటున్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే వెళ్లి పెళ్లి ఆపిస్తున్నారు. చదువు కొనసాగించేలా పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికలను తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్నారు.

చదివిస్తే ఉన్నతస్థానాలకు..



ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఉండాలి. బాలికలను కాపాడుకోవడం అందరి బాధ్యత. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తే వారు కుటుంబానికి కాకుండా ఆ గ్రామానికే పేరు తెస్తారు. ఆడ, మగ అనే లింగ వివక్ష ఉండకూడదు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో బాలికల జనాభా పెంచేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం.

– అనంతలక్ష్మి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి



లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



స్కానింగ్‌లో లింగనిర్ధారణ చేసి రిపోర్టు ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని క్లినిక్‌ల్లో బోర్డులు పెట్టించాం. దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో ఆడపిల్లల జనాభా పెరిగేలా ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నాం. –బాలాజీ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అడ్డతీగల, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ అడ్డతీగలలో బుధవారం రాత్రి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై గురువారం ఇక్కడ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహం చేయబోయిన ఇరు కుటుంబాల సభ్యులతో మాట్లాడారు. బాలికలను 18ఏళ్ల పూర్తయ్యే వరకు చదివించాలన్నారు. సీడీపీవో సుధ వర్చువల్‌గా సురక్షిత ప్రాంతంలో ఉన్న బాలికతో ఆమె మాట్లాడి మనోధైర్యం కల్పించారు. చదువు పూర్తయ్యే బాలికకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతీ ఏడాది మార్పుల జాబితాలు, నివేదికలు తనకు నివేదించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి పప్పుల చిట్టమ్మ, ఎంపీడీవో రంగారావు, ఇన్‌ఛార్జి తహసీల్దారు తేజస్విని, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సతీష్, ఎస్సై వినోద్‌కుమార్, ఈవోపీఆర్డీ చిన్నబ్బులు, ఐసీడీఎస్ ఈవో పావని, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అడ్డతీగలలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రతన్ టాటాకు ఘన నివాళి



ఒనకఢిల్లీ గ్యారేజీ వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు (గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి ఒనకఢిల్లీలో యువకులు, ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులు గురువారం ఘన నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రాజెక్టు ఏఈఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిప్యూటీ ఈఈ జె.సత్యకిరణ్, జేఈఎం నాగం శెట్టి దీపక్, కార్మిక సంఘం నాయకులు జోగి కూర్మారావు, సురేష్‌కుమార్, కె.సూర్యప్రకాశ్, ఆదివాసీ నాయకుడు నాయర్, యువజన సంఘం నాయకుడు అమరేశ్వర్(గ్రామ), మాజీ సర్పంచి జగన్నాథంతల తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసు అధికారులు

చింతూరు, న్యూస్‌టుడే: పోలీసుల ఎదుట ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా గురువారం ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కుంట ఏరియా కమిటీలోని 8వ ప్లాటూన్ సభ్యుడు ముచ్కి ఐతా, కుంట లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ (ఎల్‌వోఎస్) సభ్యురాలు హింగే లొంగిపోయారని పేర్కొన్నారు. వీరిలో ముచ్కి ఐతా 16 ఏళ్లకే మావోయిస్టుల సిద్ధాంతాలకు ప్రేరేపితుడై 2020 నుంచి మిలీషియా సభ్యుడిగా పని చేస్తూ 2022 నుంచి కిష్టారం ఏరియా కమిటీలో పనిచేశాడని తెలిపారు. ప్రస్తుతం 8వ ప్లాటూన్ సభ్యుడిగా పని చేస్తున్నాడని, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు నిర్వహించిన పలు దాడుల్లో ముందున్నాడని పేర్కొన్నారు. మరొక సభ్యురాలు హింగే మావోయిస్టులు చేసిన పలు హింసా కార్యక్రమాల్లో పాల్గొందని వివరించారు. ఇన్‌ఫార్మల నెపంతో ముగ్గుర్ని హత్య చేసిన సంఘటనలో ఈమె పాల్గొన్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి వీరిద్దరు జన జీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకుని పోలీసుల ఎదుట లొంగిపోయారని ప్రకటించారు. పార్టీకి ప్రజల్లో ఆదరణ కరవైందని, అగ్రనేతలు తమ ఇష్టం వచ్చిన పనులు చేయించుకోవడంతో పాటు అమాయకులను పార్టీలోకి చేర్చుకుని అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పించడం, ఏపీలో లొంగిపోయిన మావోయిస్టులకు కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని ఇక్కడ వీరు లొంగిపోయారని ఏఎస్పీ పేర్కొన్నారు. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై రమేశ్, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ మాథ్యూ, పోలీసులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు ఎస్పీగా ఎస్.ఎల్.ఎన్.రెడ్డి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లా అదనపు ఎస్పీగా ఎస్.ఎల్.ఎన్.రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఆర్‌లో ఉన్న అదనపు ఎస్పీ సత్తిరాజు పల్నాడు అదనపు ఎస్పీగా బదిలీపై వెళ్లనున్నారు. అనంతపురం జిల్లా ఏఆర్‌లో ఉన్న ఎస్ఎల్ఎన్ రెడ్డి ఇక్కడకు వస్తున్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

వై. రామవరం, న్యూస్‌టుడే: పామాయిల్ తోటల్లో అంతర పంటలు వేసుకుని అధిక ఆదాయం పొందవచ్చని పతంజలి ఫుడ్స్ సూపర్‌వైజర్ రాంబాబు అన్నారు. పి.ఎర్రగొండ పంచాయతీ వంకబారి గ్రామంలో గురువారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో రాంబాబు మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకోవడం వల్ల నీటి పొదుపుతోపాటు మొక్కలు ఏపుగా ఎదుగుతాయని అన్నారు. పతంజలి ఫుడ్స్ సూపర్‌వైజర్లు దుర్గాప్రసాదు, రాంబాబు, చక్రబాబు, ఆదర్శ రైతులు పల్లాల వెంకట రమణారెడ్డి, కలిమెల బాబూరావు, మాజీ సర్పంచి జమ్మల నీలంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి వైద్య కళాశాలలో తరగతులు



అనాటమీ విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ప్రిన్సిపల్ హేమలతదేవి, ఈఈ అచ్చెన్నాయుడు తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం వైద్య కళాశాల పనులు పరిశీలించారు. ఎన్ఎంసీ అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఈనెల 14వ తేదీ నుంచి ఎంబీబీఎస్ విద్యార్థుల తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపట్టాలన్నారు. ప్రిన్సిపల్ హేమలతదేవి, ఏపీఎస్ఎంఐడీసీ ఈఈ అచ్చెన్నాయుడు, డీఈఈ వర్మ, ఏఈఈలు సురేష్, డీజీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారిలో జాతీయ రహదారి పనులు పూర్తయితే పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మండల పరిషత్తు, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. చాపరాయి జలవిహారిని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. జలవిహారిని మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. సాగర పంచాయతీ బల్లగరువు గ్రామంలో సంజీవని సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. డీడీఎం భాస్కరరావు, ఎంపీడీవో నందు, తహసీల్దార్ నాగమ్మ, వ్యవసాయ అధికారిణి నీలవేణి, సంజీవని సంస్థ ప్రతినిధులు పండన్న, రాంచందర్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

హుకుంపేట, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలను పట్టణాల్లోని మార్కెట్లకు తరలించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొట్నాపల్లి పంచాయతీ పెదగరువు గ్రామంలో వాసన్ సంస్థ ఏర్పాటు చేసిన సోలార్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో అధికంగా నీరు వృథాగా పోతోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసింహారావు, ప్రసాద్, విమల్ నాయుడు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని కార్మికుడి ఆత్మహత్య



దేవుడునాయుడు (పాత చిత్రం)

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ బీ కాలనీ సమీపంలో కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గోపాలరావు కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ మండలం పెద్దగుడిపాలెం గ్రామానికి చెందిన దేవుడునాయుడు(32) అరకులోయలోని స్వీట్ షాపులో పది రోజుల క్రితం పనిలో చేరాడు. మరో స్వీట్ షాపులో పనిచేస్తున్న చిన్న ద్విచక్రవాహనాన్ని ఇతడు నాలుగు రోజుల క్రితం తెలిసిన వ్యక్తికి ఇచ్చాడు. సదరు వ్యక్తి వాహనం తీసుకురాలేదు. దీనిపై చిన్న ప్రశ్నించడంతో మనస్తాపం చెందిన దేవుడునాయుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లనున్నట్లు తెలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఎస్సై తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని మృతుడి బంధువులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: భార్యతో గొడవ పడి ఆమెను బెదిరించేందుకు పురుగుల మందు తాగిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందారు. అరకులోయ ఎస్సై గోపాలరావు కథనం ప్రకారం.. అరకులోయ మండలం పద్మాపురం గ్రామానికి చెందిన దూలి రమణ (30) ఆటో నడిపేవాడు. మద్యానికి అలవాటు పడిన ఆయన భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈనెల 7న భార్యతో గొడవపడి పురుగుల మందు తాగి ఆమెను బెదిరించాడు. ఆయన్ను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో బంధువులు చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గతంలోనే ఇలాగే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి తల్లి ప్రభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

సీలేరు ఈఈగా శ్రీనివాసరెడ్డి



నూతన ఈఈని సత్కరిస్తున్న డివిజన్ సిబ్బంది

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు ఏపీ జెన్‌కో కార్యనిర్వాహక ఇంజినీరు(సివిల్)గా ఎం.శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ జెన్‌కో కేంద్ర కార్యాలయం (విద్యుత్తు సౌధ)లో కార్యనిర్వాహక ఇంజినీరు (క్వాలిటీ కంట్రోల్)గా పనిచేస్తున్న ఈయన్ను ఇక్కడ నియమించారు. ప్రస్తుతం సీలేరు ఈఈగా పనిచేస్తున్న గంటా భాస్కరరావును సీలేరు పంప్ స్టోరేజీ ప్రాజెక్టు ఈఈగా బదిలీ చేశారు. నూతన ఈఈకి సిబ్బంది, ఇంజినీర్లు అభినందనలు తెలిపారు. ★ బదిలీపై వెళ్తున్న భాస్కరరావును డివిజన్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు. డీఈఈ వెంకట మధు, ఏఈఈలు సురేష్, అనుదీప్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న డీపీహెచ్ఎన్ఓ భూలోకమ్మ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మాతాశిశు మరణాలపై అప్రమత్తంగా ఉండి, వారి ఆరోగ్య సంరక్షణకు తోడ్పాటునివ్వాలని డీపీహెచ్ఎన్ఓ భూలోకమ్మ అన్నారు. గురువారం ఆశా కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. మాతాశిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు కిల్కారీ సేవలు పొందేలా ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు పెట్టే విధానాన్ని వివరించాలన్నారు. వైద్యాధికారిణి అంబిక, ఎంపీహెచ్ఈవో శౌరి, ఎంపీహెచ్‌వోలు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని కింజేరు, కూడ, అంజోడ అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే ఎన్నో అనర్థాలుంటాయని చెప్పారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


'గూడు' కట్టుకున్న అక్రమాల గుట్టురట్టు!

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ తనిఖీలు

గుత్తేదారు సంస్థల్లో గుబులు

ఈనాడు, అనకాపల్లి – న్యూస్‌టుడే, అనకాపల్లి

వైకాపా హయాంలో పేదోడి గూడుతో పెద్దోళ్లు లబ్ధి పొందారు. ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తామంటూ సెంటు జాగా చొప్పున కొండలు, గెడ్డల పక్కన స్థలాలు ఇచ్చారు. 'అంతదూరం వెళ్లి ఇల్లు ఎలా కట్టుకోగలం?, మాకొద్దు బాబోయ్' అని కొందరు బెంబేలెత్తారు. 'గాబరా పడొద్దు.. మేమే కట్టించి ఇస్తామ'ని అధికారులు మభ్యపెట్టారు. 10,760 మంది లబ్ధిదారుల పేరిట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. అధికారులు సైతం లబ్ధిదారులకు బిల్లు చెల్లించే స్లాబ్‌లను మార్చి గుత్త సంస్థలకు అనుకూలంగా చెల్లింపులు చేశారు. సిమెంటు, ఇనుము గంపగుత్తగా ఇచ్చారు. ఇక్కడే కొంతమంది చేతివాటం చూపారు. రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఇటీవల తనిఖీ చేయగా కొన్ని అక్రమాలు వెలుగుచూశాయి. తాజాగా మిగతా గుత్తేదారు సంస్థలు నిర్మించే ఇళ్లపైనా విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడంతో ఆయా సంస్థల్లో గుబులు రేగుతోంది.



తుప్పలు, డొంకలతో అడవిని తలపిస్తున్న సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు

అనకాపల్లి మండలం సంపతీపురం, రొంగలివానిపాలెం, కూండ్రం, కుంచంగి, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, పిసినికాడ, సీతానగరం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జీవీఎంసీ పరిధిలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఊరికి రెండు, మూడు కి.మీ దూరంలో స్థలం ఇస్తేనే ఆలోచించేవారు.. ఏకంగా 40 కి.మీ. నుంచి 60 కి.మీ దూరంలో ఇస్తే నిర్మాణాలకు ఎవరైనా ముందుకువస్తారా?.. ఇక్కడ కూడా అదే జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని సెంటు జాగాలో ఇళ్ల నిర్మాణాలన్నింటినీ ఆప్షన్-3 కింద నాలుగు గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వాటిలో జేఎన్ఆర్, గ్రీన్ కాంక్రీట్ ప్రొడక్ట్స్ సంస్థలు అనకాపల్లి మండల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాయి. ఆనందపురం, సబ్బవరం మండలాల పరిధిలో రాక్రీట్ సంస్థ పనులు చేసింది. తొలుత అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ చేపట్టిన నిర్మాణాలపై విచారణ చేపట్టారు. విజయనగరం జిల్లాలో ఈ సంస్థ చేపట్టిన నిర్మాణాల్లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగుచూశాయి. విశాఖ జిల్లాలో పెద్దగా ఉల్లంఘనలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు మిగతా గుత్త సంస్థలు నిర్మించే ఇళ్లను తనిఖీలు చేయబోతున్నారు.

సిమెంటు, ఇనుము పక్కదారి..

ఒక్కో లబ్ధిదారునికి 90 బస్తాల సిమెంటు, 400 కేజీల ఇనుము బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తుంది. సొంతంగా నిర్మించుకున్నవారికి వీటిని దశల వారీగా అందజేస్తారు. గుత్తేదారులకు మాత్రం ఒకేసారి ఇచ్చేస్తున్నారు. వాటిని సక్రమంగా గోదాముల్లో భద్రపరిచి ఇళ్ల నిర్మాణాలకు వినియోగించాలి. కొన్ని కాలనీల్లో సిమెంటు, ఇనుము పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల ముందు పనులు నిలిచిపోవడంతో అప్పటి వరకు ఉన్న సిమెంటును వైకాపా నేతలకు తరలించినట్లు తెలుస్తోంది. రొంగలివానిపాలెం, కూండ్రం, సంపతీపురం లేఅవుట్లలో సుమారు 25 వేల సిమెంటు బస్తాలు, 60 టన్నుల ఇనుము స్థానిక వైకాపా నేతలు పట్టుకుపోయారని ఇటీవల అనకాపల్లి కలెక్టరేట్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. కొన్ని కాలనీల్లో గుత్తేదారు సంస్థలు సిమెంటు ఇటుకల తయారీ



యూనిట్లు పెట్టుకున్నాయి. వాటికి ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంటు వినియోగించకూడదు. ఆ నిబంధన గాలికి వదిలేసి కొన్ని సంస్థలు ఆ రాయితీ సిమెంటునే ఇటుకల తయారీలో ఉపయోగించారు. సిమెంటు గోదాములను సక్రమంగా నిర్వహించకపోవడంతో వందల కొద్దీ బస్తాలు గడ్డకట్టి వృథాగా పోయాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.8 లక్షలు సరిపోకపోవడంతో లబ్ధిదారుల నుంచి అదనంగా రూ.35 వేలు చొప్పున వసూలు చేసి అధికారులు అప్పగించారు. అలా ఇచ్చిన ఇళ్లకు తుది మెరుగులు దిద్దారు.. ఇవ్వని ఇళ్లను అసంపూర్తిగా వదిలేశారు. అనకాపల్లి మండలంలో సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వాటిలో పురోగతి కనిపిస్తోంది తప్ప గుత్తేదారుల నిర్మాణం చేపట్టి 10 వేల ఇళ్లలో ఒక్క ఇల్లు కూడా వందశాతం పూర్తిగా సిద్ధం చేయకపోవడం గమనార్హం.



రొంగలివానిపాలెం కాలనీ గోదాంలో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు

వదినతో వివాహేతర సంబంధం.. నిలదీసినందుకు అన్నపై హత్యాయత్నం

సీలేరు, న్యూస్‌టుడే: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న తమ్ముడిని ప్రశ్నించిన అన్నపై తమ్ముడు హత్యాయత్నం చేసిన ఘటన దుప్పిలవాడ పంచాయతీలో చోటుచేసుకుంది. శాండికోరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భార్యను హతమార్చిన కేసులో 14 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. గ్రామంలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అతని అన్న అనుమానించాడు. దీనిపై గతంలో రెండుసార్లు తమ్ముడిని నిలదీశాడు. దీంతో రెండుసార్లు అతడిపై తమ్ముడు దాడి చేశాడు. ఈ క్రమంలో గురువారం అన్నదమ్ములిద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో గొడ్డలితో అన్నను కొట్టడంతో రెండు చేతులు విరిగిపోయాయి. బంధువులు అంబులెన్స్‌లో సీలేరు పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చింతపల్లి తరలించారు. దీనిపై సీలేరు ఎస్సై జె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారయ్యాడని ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

అథ్లెటిక్స్‌లో గిరి విద్యార్థుల సత్తా

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ డిగ్రీ కళాశాల విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో రాజమహేంద్రవరంలో అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. 200 మీటర్ల పరుగు పందెంలో ఆ కళాశాలకు చెందిన శెట్టి లోహిత్ 22.47 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల పరుగు పందెంలో 50 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. లాంగ్‌జంప్‌లో గోపాలకృష్ణ ప్రథమ స్థానం సాధించాడు. ఈనెల 17, 18, 19 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఈ విద్యార్థులను స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి నాగబాబు, ఫిజికల్ డైరెక్టర్ అప్పారావు అభినందించారు.


పతకాలు సాధించిన గిరి విద్యార్థులు

బొర్రాగుహలు కిటకిట

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలోని ప్రముఖ పర్యటక కేంద్రం బొర్రాగుహలకు పర్యటకుల తాకిడి పెరిగింది. దసరా సెలవులు కావడంతో పర్యటకులు తరలివస్తున్నారు. ప్రతి నిత్యం సుమారు రెండు వేల మంది నుంచి ఐదు వేల మంది వరకు వస్తున్నారు. గురువారం గుహలకు రూ.3 లక్షలు ఆదాయం సమకూరిందని బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.


బొర్రాగుహల్లో సందర్శకులు

పశువుల వసతిగృహం పూర్తయ్యేనా?

వైకాపా ప్రభుత్వంలో నిలిచిన పనులు


పిల్లర్ల స్థానంలో నిలిచిన షెడ్డు నిర్మాణం

కొయ్యూరు, న్యూస్‌టుడే

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరైన రాష్ట్రంలోనే మొట్టమొదటి పశువుల వసతిగృహ నిర్మాణ పనులను వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రెండు వందల పశువులకు సరిపడా నాలుగు షెడ్ల నిర్మాణ పనులు పడకేశాయి. గిరి రైతులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ నల్లగొండ గ్రామంలో 2015-16లో పశువుల వసతిగృహాన్ని రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి మంజూరు చేశారు. కర్నూలు జిల్లా బనగానపల్లిలో రెండోది మంజూరు చేశారు. ఈ వసతిగృహంలో స్థానిక రైతులకు చెందిన గేదెలు, ఆవులను ఉంచుకొని, వాటి నుంచి తీసిన పాలను తమకు నచ్చిన డెయిరీకి ఇచ్చుకోవడానికి అందరూ నిర్ణయించుకున్నారు. పశువుల మేతకు, రేకుల షెడ్ల నిర్మాణాలకు నల్లగొండలో స్థలాన్ని కేటాయించారు. నాలుగు రేకుల షెడ్లు, దూడల సంరక్షణ తదితర వాటికి మరో భవన నిర్మాణం కోసం రూ.కోటిన్నర నిధులు మంజూరు చేశారు. యాభై శాతం ఉపాధి హామీ, మిగతావి ఎస్‌డీపీ నిధులు కేటాయించారు. నిధులు మంజూరైన తర్వాత కొద్దిరోజులకు పనులు ప్రారంభమయ్యాయి. గుత్తేదారు రెండు రేకుల షెడ్లను దాదాపుగా పూర్తిచేశారు.


తుప్పల్లో ఉన్న పునాదులు


వసతిగృహంలో గేదెలు

ఒకటి పిల్లర్ల స్థాయిలో, మరొకటి పునాది స్థాయిలోనే నిలిచిపోయింది. నెలల తరబడి ఎండలోనే పశువులు ఉండిపోతుండటంతో రెండు షెడ్లలో మిగిలిన కొన్ని పనులను స్థానిక రైతులే చేసుకున్నారు. అందులో గేదెలు, పశువులు ఉంచుతున్నారు. వైకాపా హయాంలో నిర్లక్ష్యం వహించడంతో పనులు పడకేశాయి. సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడం, నిర్మాణ వ్యయం పెరిగిందంటూ గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో తెదేపా హయాంలోనే మంజూరైన పశువుల వసతిగృహం పనులను ఇప్పుడు పూర్తిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం ద్వారా 2024-26 సంవత్సరాలకు సంబంధించి మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం సాయంత్రం అయిదు గంటలతో ముగుస్తుందని ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీధర్ తెలిపారు. దరఖాస్తులు చేసుకుని ఎంట్రీపాస్ పొందిన వారంతా సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పాడేరులోని వీఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు హాజరుకావాలని కోరారు. రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 మద్యం దుకాణాలకు 168 దరఖాస్తులు రాగా, చింతూరు స్టేషన్ పరిధిలో ఎనిమిది దుకాణాలకు 320 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాలకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని స్థానిక ఎక్సైజ్ సీఐ కూర్మారావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆరు దుకాణాలకు 103 దరఖాస్తులు వచ్చాయన్నారు. చింతపల్లి మండలంలో మూడు షాపులకు 50, గూడెంకొత్తవీధిలో రెండింటికి 10, కొయ్యూరులో ఒక్క దుకాణానికి 43 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

అ వీ ఇ వీ

14 నుంచి పల్లె పండగ

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి పల్లె పండగ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యతాక్రమంగా ఈనెల 21 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరి 2025 నాటికి వీటిని పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి, కొమ్మంగి, లోతుగెడ్డ పంచాయతీల కార్యదర్శిగా శ్రీనివాస్ అందించిన సేవలు అభినందనీయమని సర్పంచులు చింతర్ల సునీల్, పుష్పలత అన్నారు. బదిలీపై వెళుతున్న శ్రీనివాస్ దంపతులను గురువారం స్థానిక సచివాలయంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సత్కరించారు. బలపం సర్పంచి రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల అనుమానాలు నివృత్తి చేయాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీపై వినియోగదారుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత జీసీసీ అధికారులపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం చింతపల్లి జీసీసీ కార్యాలయం వద్ద ఈ- కేవైసీ చేయించుకునేందుకు వరుసలో ఉన్న వినియోగదారులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పథకాలతో సంబంధం లేకుండా గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారులందరికీ ఉచితంగా సిలెండర్లు ఇవ్వాలని కోరారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

వై. రామవరం, న్యూస్‌టుడే: మండలంలోని కోట గ్రామంలో గురువారం ఉపాధిహామీ పనులపై గురువారం గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ గ్రామసభలో ఏపీవో సాయిబాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉపాధి పనుల్లో పాల్గొనాలని తెలిపారు. ఉపాధి పనుల శాతాన్నిబట్టి గ్రామంలో గ్రామంలో అవసరమయ్యే డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులు మంజూరు అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ఉపాధి పనిలో పాల్గొనాలని అన్నారు. గ్రామ పెద్దలు చిన్నారావు, రాంబాబు, రాజారావు, తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో మానసిక దివ్యాంగుల సంక్షేమానికి 'ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ' ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏడీఎంహెచ్‌వో డేవిడ్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని గురువారం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి వైద్యులు, సిబ్బందితో పాటు మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులతో చేపట్టిన ర్యాలీని ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ శేషారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఎంహెచ్‌వో డేవిడ్, ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎం ఇందిర చేతులమీదుగా మానసిక దివ్యాంగులకు ప్రోత్సాహకంగా నగదు చెక్కులు అందజేశారు. పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఏరియా ఆసుపత్రిలో మానసిక రోగులకు సైకాలజిస్టును ఏర్పాటు చేయడంతోపాటు మందులు సరఫరా చేయాలని బృందావనం మండల సమాఖ్య సభ్యులు సమావేశంలో కోరారు. ఆసుపత్రి వైద్యులు ప్రేమ్‌కుమార్, సీఆర్‌పీ సిబ్బంది దొరబాబు, సత్తిబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్ల నరికివేత?

దేవీపట్నం, న్యూస్‌టుడే: చినరమణయ్యపేట- సీతారం గ్రామాల మధ్య ఓ పంట పొలంలో కొన్ని టేకు చెట్లు నరికివేశారంటూ గురువారం సోషల్ మీడియాలో ఓ వార్త హల్‌చల్ చేసింది. పోలవరం ప్రాజెక్టు ముంపు నేపథ్యంలో మండలంలోని 44 గ్రామాలను నిర్వాసితులు ఖాళీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల ముంపు గ్రామాల్లో కలప అక్రమ రవాణాదారులు చెలరేగి పోతున్నారు. దాదాపు 50కి పైగా టేకుచెట్లు నరికివేసినట్లు సమాచారం. నరికిన చెట్లకు రైతులు అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా.. అనుమతులు లేకుండా బయటకు తరలించారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. దీనిపై ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానన్నారు. సొంత పొలంలో టేకు చెట్లు నరికినా అనుమతులు తీసుకోవాలని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.


చినరమణయ్యపేట- సీతారం గ్రామాల మధ్య నరికివేతకు గురైన టేకు చెట్లు

మూఢనమ్మకాలు వద్దు

వీఆర్‌పురం, కూనవరం, న్యూస్‌టుడే: ఉమ్మడివరంలో ఆదివారం కురిసిన వర్షానికి ఏర్పడిన మహా పుట్టగొడుగుపై దేవత వెలిసిందంటూ కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో ప్రచారం సరికాదని కూనవరం ఎఫ్‌ఆర్వో ఎం.కరుణాకర్ పేర్కొన్నారు.. ఇది యూరోపియన్ దేశాల్లో ఏటా నవంబర్‌లో కన్పిస్తుందని, దీని పేరు 'నారింజ తొక్క సిలీంద్రం' అని చెప్పారు. దీనిని 2011లో నార్వేలో నవంబర్ 27న గుర్తించారన్నారు. ఇది అడవులు, గ్రామాల సరిహద్దుల్లో చెదలు కుళ్లిపోవడంతో ఏర్పడుతుందన్నారు. మన వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలు, విపరీతమైన ఎండల ప్రభావంతో నెల రోజులు ముందుగానే కనిపించిందన్నారు. మన దేశంలో మొదటి సారి ఈ మహా పుట్ట గొడుగు కనిపించిందని పేర్కొన్నారు.

చినుకు పడితే చిత్తడే...

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి రూఢకోట, కుమడ, బూసిపుట్టు ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలో డేగలపుట్టు, కరిముఖిపుట్టు గ్రామాల మధ్య రోడ్డు చినుకుపడితే చిత్తడవుతోంది. వర్షం పడితే రోడ్డుపై గుంతల్లో నీరుచేరి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల మీదుగా వచ్చే వరద నీరు రోడ్డు, కల్వర్టుపై నుంచి ప్రవహిస్తోంది. కరిముఖిపుట్టు, నందిమెట్ట గ్రామాల మధ్య ఉన్న వంతెన సమీపాన రోడ్డుపై ఏర్పడిన గుంత నీటితో నిండి చెరువును తలపిస్తోంది. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టు నుంచి రూఢకోట వరకు రూ.కోట్ల ఖర్చుతో తారురోడ్డు నిర్మించిన అధికారులు, వంతెనలు, కల్వర్టుల నిర్మించిన ప్రదేశాల్లో రోడ్డుపై గుంతలు విస్మరించారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదాలు నివారించాలని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన 80 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతలతో దర్శనమిస్తున్న రూఢకోట రోడ్డు

గొందివలస గొంతెండుతోంది!


కలుషిత నీటిని పట్టుకుంటున్న గిరిజనులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొర్రా పంచాయతీ గొందివలసలో గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తమ సొంత డబ్బులతో పైపులు అమర్చుకుని కొండవాలు ప్రాంతం నుంచి నీటిని మళ్లించి తమ అవసరాలు తీర్చుకుంటున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కలుషిత నీరు వస్తున్నాయని, తాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని ఆ పంచాయతీ నాయకుడు బాలరాజు తదితరులు కోరారు.

దుర్గామాతా పాహిమాం


కొయ్యూరులో బోనాలతో మహిళలు, భక్తులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రులు జిల్లావ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. కొయ్యూరులోని కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. మహిళలు బతుకమ్మ బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్, కమిటీ సభ్యులు బాలరాజు, చిరంజీవి, దొరబాబు, రాజశేఖర్, దేవుడు, వీరయ్యదొర, చక్రరావు, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పాలమామిడి పంచాయతీ కొక్కిరమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధియోగి గురూజీతో హోమం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శేఖర్, ఆలయ ధర్మకర్త బాలయ్యదొర, కమిటీ సభ్యులు మత్స్యరాజు, మోహనరావు, బాలాజీ, అరుణ్, నూకరాజు, నాయుడు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష కుంకుమార్చన చేశారు. చిన్నారులు అమ్మవారి అలంకరణలో అలరించారు.


అరకులోయలో ప్రత్యేక అలంకరణలో చిన్నారి


ఉమ్మడివరంలో దుర్గాదేవిగా అలంకరణ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పాతసుజనకోట గ్రామంలోని గంగమ్మతల్లి ఆలయంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచి పూర్ణిమ పాల్గొని భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు చేశారు. వైకుంఠరావు, కృష్ణారావు, అనీల్ ప్రభాకర్, రాజా, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండలోని ధారాలమ్మ ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఒడిశా నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విజయ దశమి శరన్నవరాత్రులలో దుర్గమ్మ గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ దీక్షా మాలధారులు దీక్ష ముగించుకుని ఇరుముడులతో విజయవాడ బయలుదేరారు.

వై. రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరం ప్రధాన రహదారిపై ఉన్న దుర్గమ్మ గుడిలో గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు సారె తీసుకొచ్చి ఊరేగింపుగా తిరిగారు. పి.ఎర్రగొండ నుంచి వై. రామవరం వరకు భక్తులు కాలినడకన తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో శారదాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాకలో కొలువైన మండపంలో అర్చకులు హోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గుండాలకాలనీ, లక్ష్మీపురం, తోటపల్లి, నెల్లిపాక, చోడవరం, నందిగామ తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఉమ్మడివరంలో ఉత్సవ మండపం నిర్వాహక కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు చేసి, ప్రత్యేక నైవేద్యాలు నివేదించారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకస్వామి పవన్ కుమార్ చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. తులసిపాక ఘాట్ రోడ్డులో కొలువైన వనదుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.


వై. రామవరం మండలం పి.ఎర్రగొండ నుంచి బోనాలతో ఊరేగింపు


ఎటపాకలో హోమం

అమ్మవారికి వెండి శఠగోపం వితరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మార్కెట్ వీధి వద్ద ఉన్న ఆలయంలో దుర్గమ్మకు గంగిశెట్టి కోటి, దేవి దంపతులు రూ.50వేల విలువైన వెండి శఠగోపం సమర్పించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు బద్దిరెడ్డి సూరిబాబు, వైవీ రమణయ్య, తిరివీధి వెంకటేశ్వరరావు, సలాది బాపిరాజు సమక్షంలో అమ్మవారికి వెండి గోపురాన్ని వితరణగా ఇచ్చారు.


దుర్గమ్మతల్లి వెండి గోపురాన్ని అందిస్తున్న కోటి, దేవి దంపతులు

రహదారి నిర్మించాలని వినతి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: శ్రీరామగిరి-చొక్కనపల్లి మధ్య రహదారి పనులు చేపట్టాలని శ్రీరామగిరి సర్పంచి పులి సంతోశ్ డిమాండ్ చేశారు. శ్రీరామగిరిలో గురువారం నిర్వహించిన సీపీఎం నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వచ్చిన గోదావరి, శబరి వరదలకు ఈ రెండు గ్రామాల మధ్యలోని రహదారి కొట్టుకుపోయిందని చెప్పారు. దారంతా రాళ్లు తేలిపోయి, గుంతలతో ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని చెప్పారు. వైద్యం కోసం చొక్కనపల్లి నుంచి రేఖపల్లి వెళ్లాలంటే వృద్ధులకు, గర్భిణులకు, దివ్యాంగులకు ఇబ్బందిగా ఉందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పూనెం సత్యనారాయణ, చిన్నబాబు, పంకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే బోట్లు నిలిపేస్తాం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించకుంటే పర్యటకం నిలిపివేస్తామని ఏపీ పర్యటక ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు బోట్ల యాజమానులను హెచ్చరించారు. పాపికొండల పర్యటకం నిర్వాహణకు రేఖపల్లి, రంపచోడవరంలో రెండు చోట్ల సమావేశాలు జరిగాయి. వరదల నేపథ్యంలో నిలిచిన పర్యాటకం ఎప్పుడు ప్రారంభించాలి, నిర్వాహకులు చేపట్టాల్సిన ప్రమాద నివారణ చర్యలు, బోట్లులో ఉండాల్సిన పరికరాలు, ప్రతీ పర్యాటక కేంద్రంలో ఓ పైలెట్‌బోట్ ప్రతీరోజు పర్యవేక్షణ, నిత్య సమాచార వ్యవస్థ ఏర్పాటులపై గురువారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ప్రతీ బోట్‌కు నిపుణుల తనిఖీ దస్త్రాలు తప్పక ఉండాలన్నారు బోట్‌ఎక్కిన పర్యాటకులు తిరిగివచ్చి దిగేవరకు జాగ్రత్తగా చూడాలన్నారు. బోట్లయాజమాన్యం ఈ సందర్భంగా కొన్ని సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గిరిజనుల సొంతింటి కల సాకారం

హుకుంపేట, న్యూస్‌టుడే: పీవీటీజీ గిరిజనుల సొంతింటి కల నెరవేరుతోందని ఐటీడీఏ పీవో అభిషేక్ పేర్కొన్నారు. దుర్గం పంచాయతీ సంపంగిపుట్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా నిర్మించిన 18 ఇళ్లను గురువారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం పీఎం జన్‌మన్‌లో భాగంగా మంజూరైన 28 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. పీవో మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎస్ఐసీ ప్రతినిధి కె. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీవో అభిషేక్ తదితరులు

అరకులోయ తహసీల్దార్‌గా ప్రసాద్



అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ తహసీల్దార్‌గా ఎంవీవీ ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మాకవరపాలెం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2019 నుంచి 2022 వరకు అనంతగిరి తహసీల్దార్‌గా ఆయన పనిచేశారు. భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి నుంచి వేటుకూరు వెళ్లే రహదారిలోని పూజారిపాకలు, చెలకపాకలు వద్ద ఉన్న వాగులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– పెంటా సురేంద్ర, వేటుకూరు

✓: పూజారిపాకలు, చెలకపాకలు గ్రామాల వద్ద ఉన్న కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం.

– వెంకటరమణ, మండల ఇంజినీరింగు అధికారి, మారేడుమిల్లి

?: మారేడుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు నిర్మించ తలపెట్టిన అదనపు భవన నిర్మాణం చాలాకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో సరిపడా వసతి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు.

– వెంకటరెడ్డి, మారేడుమిల్లి

✓: ఆశ్రమోన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వీరకిశోర్, ఎంపీడీవో, మారేడుమిల్లి

ప్రధాన రహదారిలో గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం



రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలుపడ్డాయి. ముఖ్యంగా భూపతిపాలెం జలాశయం సమీపాన మలుపుల్లో పలుచోట్ల పెద్ద గుంతలుపడి నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఇటీవల వార్త ప్రచురితమైంది. స్పందించిన ర.భ.శాఖ అధికారులు గురువారం గుంతల్లో కంకర పర్చి క్రసర్ బూడిదను వేసి చదును చేయించారు. దీంతో వాహనదారులలో ఆందోళన తొలగింది.

అనుకూలమైన స్థలం నుంచే రహదారి నిర్మాణం

చింతూరు, న్యూస్‌టుడే: అనుకూలమైన స్థలాన్ని ఎంచుకుని జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ పేర్కొన్నారు. ఎర్రంపేట నుంచి కల్లేరు వెళ్లే జాతీయ రహదారిపై 326 రాష్ట్ర రహదారికి కలిపే కూడలి కోసం గురువారం స్థల పరిశీలన చేపట్టారు. గతంలో ప్రతిపాదించినట్లు కాకుండా ఎర్రంపేట యూనియన్ బ్యాంక్ పక్క నుంచి నేరుగా కుయిగూరు వాగు వద్దకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు స్థల సేకరణ చేపట్టారు. ప్రాజెక్టు అధికారి కుయిగూరు గ్రామాన్ని సందర్శించగా అక్కడి రైతులు ఆయిల్ ఇంజిన్లు కావాలని చెప్పడంతో అవసరమైన రైతుల జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. చింతూరు డీఎఫ్‌వో బబిత, ఎన్‌హెచ్ పాల్గొన్నారు.


రహదారి విస్తరణ స్థలాన్ని పరిశీలిస్తున్న పీవో తదితరులు

రోగులకు సత్వరమే వైద్యసేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు సత్వరమే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన సేవలు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. రంపచోడవరం మండలం పెదగెద్దాడ పీహెచ్‌సీని పీవో సింహాచలం గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, సిబ్బంది ఎంతమంది ఉన్నారు. రోగులు ఎంతమంది పీహెచ్‌సీకి వస్తున్నారు తదితర వివరాలను వైద్యులు వినోద్‌కుమార్, ముఖేంద్రలను ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిధిలో ఎంతమంది గర్భిణులు ఉన్నారని అడిగారు. జ్వరాలతో వచ్చిన వారికి వెంటనే రక్తనమూనాలను తీసి నిర్ధారణ చేసి మందులను ఇవ్వాలన్నారు.


పెదగెద్దాడలో వైద్యులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం